సాక్షి రంగారెడ్డి

సోమవారం । 13 । అక్టోబర్ । 2025



హత్యాయత్నం కేసులో..

హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించామని మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి చెప్పారు. 8లో▸



నిబంధనలు తప్పనిసరి

హైద్రాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. 8లో▸



గుట్కావిక్రేతలపై కేసు

నిషేధిత గుట్కాలు విక్రయిస్తున్న ఆరుగురిపై షాబాద్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

భూ బాధితులకు ఇంటి జాగలు

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన ఎల్మినేడు భూ బాధితులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎల్మినేడు భూ బాధితులకు ఇచ్చిన మాట ప్రకారం ఇంటి జాగలు ఇచ్చి ఆదుకుంటానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం భూ బాధితులు ఎమ్మెల్యే నివాసంలో మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒప్పించి కలెక్టర్‌కు ఆదేశాలు ఇప్పించామని చెప్పారు. త్వరలోనే అధికారులు ఎల్మినేడుకు మళ్లీ వస్తారన్నారు. మొదట ఎంజాయ్‌మెంట్ సర్వే చేపట్టి రికార్డు ప్రకారం అసలైన రైతులకే ప్లాట్లు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. అక్రమాలు, అవినీతి జరిగితే లీగల్‌టీం క్షుణ్ణంగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటుందని వివరించారు. అధికారులు పారదర్శకంగా సర్వే చేసి అందరికి న్యాయం జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పట్నం శివశంకర్, శేఖర్‌రెడ్డి, యాదగిరి, శ్రీశైలం, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి డాక్టరేట్

ఇబ్రహీంపట్నంలో ఘన స్వాగతం



డాక్టరేట్ అందుకుంటున్న సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం: ముగ్గురు మండల వాసులకు డాక్టరేట్ వరించింది. ఢిల్లీకి చెందిన మ్యాజిక్ అండ్ ఆర్ట్స్ యూనివర్సిటీ సోషల్ వర్క్, సేవా కార్యక్రమాలను గుర్తించి ఓ మీడియా సంస్థ ప్రతినిధిగా పనిచేస్తున్న సురమోని సత్యనారాయణ, మత్స్యకార సంఘం నేత, టీడీపీ నాయకుడు జలమోని రవీందర్ ముదిరాజ్, మాజీ ఉపసర్పంచ్, బీఆర్ఎస్ ఆదిబట్ల నాయకుడు పల్లె గోపాల్‌గౌడ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆదివారం వారికి ఇబ్రహీంపట్నంలో ఘన స్వాగతం పలికారు.

రజకులంతా ఏకతాటిపైకి రావాలి

రజకాభివృద్ధి సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్



ఆత్మీయ సమ్మేళనంలో రజకాభివృద్ధి సంస్థ ప్రతినిధులు

కందుకూరు: సమస్యల పరిష్కారానికి రజకులంతా ఏకతాటిపైకి రావాలని రజకాభివృద్ధి సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమరాజు వెంకటేశ్ అన్నారు. ఆదివారం మండలకేంద్రం సమీపంలోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు అక్కెనపల్లి శ్రీనివాస్, నాయకులు మల్లేశ్, రాజు, కృష్ణ, సురేందర్ రాజు, వెంకటేశ్, గణేష్, శంకరయ్య, శ్రీనివాస్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్‌కు గుణపాఠం కావాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్‌లో జరగనున్న ఉప ఎన్నిక కాంగ్రెస్‌కు గుణపాఠం కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. షేక్‌పేటకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు చెర్క మహేష్ ఆదివారం నగరంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరా రు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ప్రజలకు కారు కావాలో, బుల్డోజర్ కావాలో నిర్ణయించుకోవాలన్నారు. అవినీతి సొమ్మును జూబ్లీహిల్స్‌లో ఖర్చు చేయనున్నారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే మోరీలో వేసినట్లేనన్నా రు. హైదరాబాద్ గాడిన పడాలంటే కేసీఆర్ రావాలని, అది జూబ్లీహిల్స్ నుంచి ప్రారంభం కావాలన్నారు. అన్నీ తెలిసీ బీసీ రిజర్వేషన్ల అంశంలో సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని కేటీఆర్ దుయ్యబట్టారు. పార్లమెంట్‌లో చేయాల్సి న చట్టం అసెంబ్లీలో చేస్తే చెల్లదని తెలిసి బీసీ రిజర్వేషన్ల పేరుతో మోసం చేశారన్నారు.

అదరం.. బెదరం!

- ఏసీబీ కేసులకు వెరవని అక్రమార్కులు
- డిస్కంలో వరుసగా పట్టుబడుతున్న ఇంజనీర్లు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: కొత్తలైన్లు, లైన్ షిఫ్టింగ్ పనులు, మీటర్లు, డీటీఆర్‌లు, ప్యానల్ బోర్డులు కరెంటోళ్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. నిబంధనల మేరకు లోడును బట్టి ఫీజులు చెల్లిస్తున్నా.. క్షేత్రస్థాయిలోని ఆర్టిజన్లు, జూనియర్ లైన్‌మెన్లు, ఏఈ, ఏడీఈ, డీఈ, చివరకు ఎస్‌ఈలు.. ఇలా ఎవరి స్థాయిలో వారికి చేయి తడపనిదే పని కావడం లేదు. నిరాకరించిన వారిని ముప్పుతిప్పలు పెడుతున్నారు. అధికారుల తీరుతో విసుగు చెందిన వినియోగదారులు చివరకు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు. ప్రతి నెలా ఎవరో ఒకరు ఏసీబీకి పట్టుబడుతూనే ఉన్నారు. అయినా.. అక్రమార్కుల వైఖరిలో మాత్రం మార్పురావడం లేదు. నిజానికి ఇతర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలతో పోలిస్తే డిస్కం ఇంజనీర్ల వేతనాలు చాలా ఎక్కువే. ఒక్కో డీఈకి సీనియార్టీని బట్టి నెలకు రూ.2 నుంచి రూ.4 లక్షల వరకు వేతనం చెల్లిస్తుంది. సీనియర్ లైన్‌మెన్, లైన్ ఇన్స్‌పెక్టర్ల వేతనాలు సైతం రూ.లక్షకు పైమాటే. ప్రభుత్వం వీరికి భారీగా వేతనాలు చెల్లిస్తున్నప్పటికీ.. వీరిలో కొంత మంది అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రతి పనికి ఓ రేటు ఫిక్స్ చేస్తున్నారు. అడిగినంత ముట్టజెప్పితే సరి..లేదంటే కొర్రీలు పెట్టి ముప్పు తిప్పలు పెడుతుంటారు. ఎక్కడా లేని విధంగా ఫోకల్, నాన్ ఫోకల్ అనే పేరుతో పోస్టులను సృష్టించి పోస్టింగ్ కోసం చేసిన ఖర్చులను తిరిగి రాబట్టుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. అక్రమ సంపాదనకు అలవాటు పడి అవినీతి నిరోధకశాఖ వలలో చిక్కుకుంటున్నారు. అరెస్టై జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత అంతకంటే పెద్ద పోస్టుల్లో చేరి, మళ్లీ అదే తంతు కొనసాగించడం విస్మయం కలిగిస్తోంది.

సర్కిల్ ఆఫీసుల్లోనూ అక్రమార్కుల తిష్ట

హైదరాబాద్ సౌత్, హైదరాబాద్ సెంట్రల్, బంజారాహిల్స్ సర్కిళ్లు, డివిజన్లు, సబ్ డివిజన్లు, సెక్షన్ల పరిధిలో ఇప్పటికే నిర్మాణాలు పూర్తయ్యాయి. కొత్త కనెక్షన్లకు ఎస్టిమేషన్లు సైతం ఉండవు. దీంతో ఆశించిన స్థాయిలో అదనపు ఆదాయం సమకూరదు. ఆయా డివిజన్లు, సబ్‌డివిజన్లు, సెక్షన్లలో పోస్టులకు ఇంజనీర్లు పనిచేసేందుకు పెద్దగా ఆసక్తి చూపరు. శివారులోని మేడ్చల్, సైబర్‌సిటీ, సరూర్‌నగర్, రాజేంద్రనగర్ సర్కిళ్లలో హైరైజ్ భవనాలు, మల్టీ స్టోరేజ్ బిల్డింగ్స్, ఐటీ అనుబంధ సంస్థలు, పారిశ్రామిక వాడలు ఎక్కువ. ఇక్కడ పోస్టుల కోసం భారీగా ఖర్చు చేస్తుంటారు. ఆ తర్వాత అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడుతున్నారు. కేవలం క్షేత్రస్థాయిలోని ఆర్టిజన్లు, ఏఈలు, ఏడీఈలు మాత్రమే కాదు సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, మేడ్చల్ సర్కిల్ ఆఫీసుల్లోని కీలక అధికారులు సైతం ఒక్కో ఫైలుకు ఒక్కో రేటు నిర్ణయించి అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు.

మచ్చుకు కొన్ని ఏసీబీ కేసులు

- అదనపు లోడు కోసం దరఖాస్తు చేసుకున్న ఓ వినియోగదారుడి నుంచి లాలాగూడ సెక్షన్ ఇన్‌చార్జి ఏఈ భూమిరెడ్డి సుధాకర్‌రెడ్డి రూ.15 వేలు లంచంగా తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.
- ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇబ్రహీంబాగ్ డివిజన్ ఏడీఈ అంబేడ్కర్ ఇప్పటికే ఏసీబీ కేసులో జైలుకు వెళ్లారు. ఆయనకు బినామీగా వ్యవహరించినట్లు ఆరోపణలున్న చేవెళ్ల ఏడీఈ రాజేశ్‌పై సైతం ఇటీవలే ఏసీబీ కేసు నమోయింది.
- గోపన్‌పల్లిలోని ఓ నిర్మాణంలో ఉన్న భవనానికి విద్యుత్ మీటర్ మంజూరు కోసం రూ.50 డిమాండ్ చేసి గచ్చిబౌలి డివిజన్ ఏడీఈ సతీశ్ ఏసీబీకి చిక్కారు. ఆయన వంద కోట్లకుపైగా ఆస్తులను కూడబెట్టినట్లు గుర్తించారు.
- విద్యుత్‌శాఖ గోల్కొండ సెక్షన్ జూనియర్ లైన్‌మెన్ శివమల్లేష్ కమర్షియల్ మీటర్ కనెక్షన్ కోసం రూ.30 వేలు తీసుకుంటూ దొరికిపోయారు.
- మంచాల మండలంలోని ఓ వెంచర్‌లో రోడ్డుకు అడ్డుగా ఉన్న 11 కేవీ, 33 కేవీ లైన్ల మార్పునకు, నూతన ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకు సరూర్‌నగర్ సర్కిల్ ఎలక్ట్రికల్ (టెక్నికల్) డివిజనల్ ఇంజనీర్ (డీఈ) టి.రాంమ్మోహన్ డబ్బులు డిమాండ్ చేసి, సదరు కాంట్రాక్టర్ నుంచి రూ.18 వేలు తీసుకుంటూ ఇటీవల ఏసీబీకి పట్టుబడిన విషయం సంచలనం సృష్టించింది.

కాల్‌సెంటర్ ఏర్పాటు చేసినా..

వ్యవస్థాగతంగా వేళ్లూనుకున్న అవినీతి, అక్రమ వసూళ్లను పూర్తిగా నియంత్రించి, పారదర్శకతకు పెద్దపీట వేసేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఇటీవల అందుబాటులోకి తెచ్చిన కాల్ సెంటర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటుకు అంచనాలు రూపొందించడం మొదలు కనెక్షన్లు, మీటర్లు, ప్యానల్ బోర్డులు, డీటీఆర్‌ల మంజూరీ, లైన్ షిఫ్టింగ్ వర్కుల వరకు ఇలా ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించి క్షేత్ర స్థాయిలోని ఆర్టిజన్లు, జూనియర్ లైన్‌మెన్లు, ఏఈలు, ఏడీఈలు, డీఈలు ఇలా ఎవరి స్థాయిలో వారు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. అవినీతి నిర్మూలన, పనుల్లో పారదర్శకత కోసం సీఎండీ ముషారఫ్ అలీ ఇటీవల 040–23454884, 7680901912 ఫోన్ నంబర్లతో ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు పోస్టర్లు ముద్రించి, ఆ మేరకు గ్రేటర్ వ్యాప్తంగా ఉన్న అన్ని సెక్షన్లు, ఈఆర్‌ఓ కేంద్రాలు, సబ్‌స్టేషన్లలోనూ అతికించింది. ఇప్పటికే 60కిపైగా ఫిర్యాదులు అందాయి. అక్రమ వసూళ్లు, విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి పాల్పడిన 19 మంది ఇంజనీర్లపై అంతర్గత విచారణ చేపట్టి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయినా క్షేత్రస్థాయిలోని కొంత మంది అక్ర మార్కుల వైఖరిలో మాత్రం మార్పు రావడం లేదు.



రూట్ మార్చ్ చేస్తున్న స్వయం సేవకులు

ఆర్‌ఎస్‌ఎస్ రూట్ మార్చ్

మొయినాబాద్: ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం మొయినాబాద్‌లో పథ సంచాలన్(రూట్ మార్చ్) చేపట్టారు. వందలాది మంది ఆర్‌ఎస్‌ఎస్ కర సేవకులు భరత మాత, హెగ్డేవార్, గోల్వాల్కర్ చిత్రపటాలతో మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మమత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ శంకర్‌పల్లి ఖండ కార్యవాహ చేకుర్త నాగిరెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ హెగ్డేవార్ ఆశయాలే స్ఫూర్తిగా హిందూ సమాజం మరింత శక్తివంతమయ్యే దిశగా స్వయం సేవకులు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గణేశ్, మహేందర్, సాయితేజ, సత్యనారాయణ, ప్రసాద్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, సుశాంత్ పాల్గొన్నారు.



రన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు

అట్టహాసంగా 'గ్లోబల్ గ్రేస్ కేన్సర్ రన్'



విద్యార్థినుల ఉత్సాహం

గచ్చిబౌలి: నగరంలో ఆదివారం జరిగిన గ్లోబల్ గ్రేస్ కేన్సర్ రన్‌కు అనూహ్య స్పందన లభించింది. గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి పర్యవేక్షణలో రన్‌ను గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం వద్ద రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పీఏసీ చైర్మన్ ఆరెకపూడిగాంధీ, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్ సీపీలు సజ్జనర్, అవినాష్ మహంతి జెండా ఊపి ప్రారంభించారు. రన్‌లో విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు, ఔత్సాహిక రన్నర్లు పాల్గొన్నారు. సుమారు 30 వేల మంది ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొనగా.. ప్రపంచవ్యాప్తంగా 130 దేశాల నుంచి 1.5 లక్షల మంది వర్చువల్‌గా పాల్గొన్నట్లు గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి వివరించారు. ఈ సందర్భంగా కేన్సర్‌ను జయించిన నీలిమ, ప్రకాశ్, సంగీత, గీత రన్‌లో పాల్గొనడం విశేషం. మహిళల విభాగంలో రాజేశ్వరి సునీత, ఉమా, పురుషుల విభాగంలో ఈశ్వర్, అనూజ్ యాదవ్, మనోజ్ విజేతలుగా నిలిచారు.

నేడు, రేపు కూడా పల్స్ పోలియో

పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న రవీంద్రనాయక్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పల్స్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం తొలి రోజు విజయవంతమైందని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్ చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఉదయం బండ్లగూడ జాగీర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారికి పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలి రోజు చుక్కలు వేయించుకోని వారికి ఇంటింటి పర్యటనలో భాగంగా సోమ, మంగళవారాల్లో చుక్కల మందు వేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దేశ వ్యాప్తంగా 290 జిల్లాల్లో, తెలంగాణలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, హనుమకొండ జిల్లాల్లో ఈ పోలియో నిర్మూలన ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. జిల్లాలో 4,20,911 మంది ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించి, వారికి ఉచితంగా పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ లలితాదేవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్

నామినేషన్ల స్వీకరణ నేటి నుంచే..

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు సంబంధించి సోమవారం ఎన్నికల సంఘం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఇదే రోజు నుంచి ఈ నెల 21వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 22న నామినేషన్ల పరిశీలన, ఈ నెల 24 వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగనుంది. ఉప ఎన్నిక పోలింగ్ నవంబర్ 11న పోలింగ్ జరగనుంది. నవంబర్ 14వ తేదీన కౌంటింగ్ చేపట్టనున్నారు.

నామినేషన్ల స్వీకరణకు అంతా సిద్ధం..

షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్ ఆర్వో కార్యాలయాన్ని సందర్శించి ఏర్పాట్లపై ఆర్వో, ఏఆర్‌ఓలతో సమీక్షించారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగేలా ఈసీఐ నిబంధనలకు లోబడి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రిటర్నింగ్ అధికారి సాయిరాంనకు సూచించారు.

విధేయులకే పట్టం

డీసీసీ ఎంపికలో కేడర్ అభిప్రాయానికే పెద్దపీట

- రోజుకు రెండు బ్లాకుల చొప్పున సమావేశాలు
- నేడు చేవెళ్ల ముఖ్య నేతలతో భేటీ
- పది రోజుల్లో ప్రక్రియ పూర్తి చేస్తాం
- ఏఐసీసీ జిల్లా పరిశీలకులు, ఎంపీ సి.రాబర్ట్‌బ్రూస్



మాట్లాడుతున్న తిరునల్వేలి ఎంపీ రాబర్ట్ బ్రూస్ పక్కన డీసీసీ అధ్యక్షుడు చల్లా

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'పారదర్శకంగా... ప్రజాస్వామ్య బద్ధంగా డీసీసీ అధ్యక్ష ఎన్నిక జరుగుతుందని, ఐదేళ్లుగా సభ్యత్వం ఉండి, సంస్థాగతంగా పార్టీ బలోపేతం కోసం పని చేస్తున్న కార్యకర్తనే డీసీసీ పీఠం వరిస్తుంది'అని ఏఐసీసీ జిల్లా పరిశీలకులు, ఎంపీ సి.రాబర్ట్ బ్రూస్ చెప్పారు. డీసీసీ ఎన్నికల పరిశీలకుడిగా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయన గాంధీభవన్‌కు చేరుకున్నా రు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కష్టకాలంలో పార్టీకి అండదండగా నిలిచి, అందరికి ఆమోద యోగ్యుడైన సమర్థుడినే డీసీసీ చీఫ్‌గా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు సహా నామినేటెడ్ పోస్టుల చైర్మన్లు, పార్టీ జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి, బ్లాక్ స్థాయి, మండల స్థాయి అధ్యక్షుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోనున్నట్లు తెలిపారు. మెజార్టీ సభ్యుల అభిప్రాయం ప్రకారమే ఈ ఎంపిక ఉంటుందని చెప్పారు.

నేడు చేవెళ్ల నేతలతో భేటీ

కేవలం పార్టీ నేతల నుంచే కాకుండా పార్టీతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎలాంటి సంబంధం లేని సామాజిక కార్యకర్తలు, సాధారణ ప్రజల నుంచి సైతం అభిప్రాయాలను సేకరించనున్నట్లు చెప్పారు. అయితే ఈ ఎంపికలో సాధారణ కార్యకర్త అభిప్రాయానికే ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇందులో ఎలాంటి పైరవీలకు ఆస్కారం లేదన్నారు. సోమవారం(ఈనెల 13న) చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో పర్యటించి, ఉదయం ఎ–బ్లాక్, మధ్యాహ్నం బి–బ్లాక్ కేడర్‌తో సమావేశమై, వారి అభిప్రాయాలను సేకరించనున్నట్లు తెలిపారు. 16వ తేదీన శేరిలింగంపల్లి నియోజకవర్గం కేడర్‌తో భేటీ కానున్నట్లు చెప్పారు. ఔత్సాహికులు తమ దరఖాస్తులను స్వయంగా అందజేయవచ్చని సూచించారు. ఈ నెల 19 వరకు మొత్తం ప్రక్రియను పూర్తి చేసి, తుది జాబితాను ఏఐసీసీకి అందజేయనున్నట్లు ప్రకటించారు. సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షులు, పరిశీలకుల బృందం సభ్యుడు వినయ్‌రెడ్డి, కర్నె శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేసులో 12 మంది

ఇదిలా ఉంటే డీసీసీ పీఠం కోసం ఇప్పటికే 12 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి ఐదుగురు, మహేశ్వరం నియోజకవర్గం నుంచి నలుగురు, చేవెళ్ల నియోజకవర్గం నుంచి ముగ్గురు చొప్పున దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి యూత్ కాంగ్రెస్ నేత బొక్క చెన్నారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు ఉన్నారు. మహేశ్వరం నియోజకవర్గం నుంచి పార్టీ సీనియర్ నేత దేప భాస్కర్‌రెడ్డి డీసీసీ పీఠాన్ని ఆశిస్తున్నారు. ఇక ఎల్బీనగర్ నుంచి నాగోల్ కంటెస్టెడ్ కార్పొరేటర్ రాజిరెడ్డి సహా చేవెళ్ల నియోజకవర్గం నుంచి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీం భరత్, పీసీసీ సభ్యుడు గౌరి సతీశ్ సైతం రేసులో ఉన్నారు. ఇక కల్వకుర్తి నియోజకవర్గం నుంచి అయిల్ల శ్రీనివాస్‌గౌడ్ సహా మరికొంత మంది డీసీసీ పీఠాన్ని ఆశిస్తున్నట్లు సమాచారం. వీరంతా ఎవరికి వారు తమ ప్రయత్నాలను ముమ్మరం చేసుకుంటున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, నామినేటెడ్ పోస్టుల చైర్మన్లు, స్థానిక సంస్థల చైర్మన్లు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు, ఎంపీపీలు, బ్లాక్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్ అధ్యక్షులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. అభిప్రాయ సేకరణలో భాగంగా అధిష్టానానికి తమ పేర్లను సిఫార్సు చేయాల్సిందిగా వారు అభ్యర్థిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

పర్యావరణ రక్షణకు కృషి చేయాలి

పర్యావరణ వేత్త, ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పర్యావరణ వేత్త, ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ మార్పులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఐక్యరాజ్య సమితి బ్రెజిల్ దేశంలో నవంబర్ 10వ తేదీ నుంచి 21 వరకు నిర్వహించనున్న కాప్–30 కార్యక్రమానికి సమాంతరంగా కొనసాగనున్న కాన్ఫరెన్స్ ఆఫ్ పీపుల్స్ పేరుతో నిర్వహించనున్న సదస్సుకు ముందస్తుగా ఈ సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీజీఆర్ చైర్‌పర్సన్ లీలాలక్ష్మారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. కాప్ కార్యక్రమం మొదటగా 1995 మార్చి 28 నుంచి ఏప్రిల్ 7వరకు జర్మనీలో నిర్వహించారని చెప్పారు. ప్రపంచంలో ఒక శాతం జనాభా ఉన్నవారి స్వార్థం కోసం చేస్తున్న ప్రకృతి విధ్వంసంతో 99 శాతం మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడవులు జీవవైవిధ్యాన్ని, పర్యావరణ వ్యవస్థలను పరిరక్షించాలని, సహజ ఆవాసాలను పరిరక్షించడం, స్థిరమైన భూ వినియోగాన్ని ప్రోత్సహించడం తదితర చర్యలు చేపట్టాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు సీజీఆర్ సంస్థ నిర్విరామంగా ఐదేళ్లుగా కాప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాలసీ నిపుణులు దొంతి నర్సింహారెడ్డి, సీజీఆర్ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారిణి రాజేశ్వరి, పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి, ఐఆర్ఎస్ అధికారి బండ్లమూడి సింగయ్య, వందేమాతరం ఫౌండేషన్ రవీందర్ రావు, సీజీఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

36 గంటలు.. నీళ్లు బంద్



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి తాగునీటిని సరఫరా చేసే కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్ట్ (కేడీడబ్ల్యూఎస్పీ) ఫేజ్– 3 కోదండాపూర్ నుంచి గొడకొండ్ల వరకు పంపింగ్ మెయిన్–1కి సంబంధించి 2,375 ఎంఎం డయా పైపులైన్‌పై భారీ లీకేజీ ఏర్పడింది. దీంతో ఎయిర్ వాల్వ్, గేట్ వాల్వ్ మార్పు తదితర మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో పలు రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాల్లో సోమవారం ఉదయం 6 నుంచి మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు.. సుమారు 36 గంటల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జలమండలి వర్గాలు పేర్కొన్నాయి.

అంతరాయం ఏర్పడే ప్రాంతాలివే..

గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్, అయ్యప్ప సొసైటీ, కావూరి హిల్స్, ప్రశాసన్ నగర్, ఫిల్మ్‌నగర్, జూబ్లీ హిల్స్, తట్టిఖానా, భోజగుట్ట, షేక్‌పేట్, హకీంపేట్, కార్వాన్, మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, గోల్కొండ, లంగర్ హౌస్, దుర్గా నగర్, బుద్వేల్, సులేమాన్ నగర్, గోల్డెన్ హైట్స్, 9 నంబర్, కిస్మత్‌పూర్, గంధంగూడ, బండ్లగూడ, శాస్త్రిపురం, అల్లబండ, మధుబన్ కాలనీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. అలాగే.. ధర్మసాయి (శంషాబాద్), సాహెబ్‌నగర్, ఆటోనగర్, సరూర్‌నగర్, వాసవీనగర్, నాగోల్, ఎన్టీఆర్ నగర్, వనస్థలిపురం, దేవేందర్ నగర్, ఉప్పల్, స్నేహపురి కాలనీ, భారతనగర్, రాంపల్లి, బోడుప్పల్, చెంగిచర్ల, మానిక్ చంద్, మల్లికార్జున నగర్, పీర్జాదిగూడ, పెద్ద అంబర్‌పేట్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని జలమండలి పేర్కొంది. వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించింది.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ వెంకటేశ్, సిబ్బంది

ఆమనగల్లు: పట్టణంలోని హైద్రాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై రాజీవ్ చౌరస్తా వద్ద ఆదివారం ఎస్ఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో పోలీసులు పెద్ద ఎత్తున వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు ఆర్‌సీ బుక్‌లు పరిశీలించారు. పలువురు డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశ్ మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి రిమాండ్



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ పవన్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ వెంకన్న

మొయినాబాద్‌రూరల్: ఆస్తి వివాదంలో వ్యక్తిని హత్య చేసేందుకు యత్నించిన ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించామని మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి చెప్పారు. వివరాలు.. సురంగల్ పౌల్ట్రీ ఫామ్‌లో 250 గజాల ప్లాట్ విషయంలో తగాదా జరుగుతోంది. ఈ క్రమంలో శనివారం రామగళ్ల ప్రసాద్, రామగళ్ల నందం, సావిత్రి దంపతులు రామగళ్ల శ్యామ్‌పై వేట కొడవలితో దాడి చేయంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని రాజేంద్రనగర్ న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుట్కా విక్రేతలపై కేసు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

షాబాద్: నిషేధిత గుట్కాలు విక్రయిస్తున్న ఆరుగురిపై షాబాద్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ కాంతారెడ్డి తెలిపిన ప్రకారం.. హైతాబాద్, నాగర్‌గూడ పాన్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు, పొగాకు ఉత్పత్తులు ఆరుగురి వద్ద లభించాయి. దీంతో వారిపై కేసు నమోదు చేసి, గుట్కా, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎస్ఐ సతీశ్, ఏఎస్ఐ రామ్‌లాల్, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిని బలిగొన్న ఈత సరదా





రాజేంద్రనగర్: జలపాతంలో ఈతకొట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి ఇద్దరు పదో తరగతి విద్యార్థులు మృత్యువాత పడిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సులేమాన్‌నగర్ ఎం.ఎం.పహాడీకి చెందిన మహ్మద్ రెహాన్ (16), సోహేల్ (15)లతో పాటు మరో నలుగురు బైక్‌లపై ఆదివారం మధ్యాహ్నం రాజేంద్రనగర్ గోల్డెన్ హైట్స్ ప్రాంతంలోని మొండికత్వ ప్రాంతానికి చేరుకున్నారు. జనచైతన్య వెంచర్‌లోని ఖాళీ స్థలంలో వాహనాలను పార్కు చేసి జలపాతం వద్దకు వెళ్లారు. ఈత కొట్టేందుకు ప్రయత్నించగా.. ప్రమాదవశాత్తు మహ్మద్ రెహాన్, సోహేల్‌లు నీళ్లలో మునిగిపోయారు. ఈ విషయాన్ని రాజేంద్రనగర్ పోలీసులకు తెలపడంతో అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. రాత్రి 8 గంటల వరకు వెతికి ఇద్దరి మృతదేహాలు నీటిలోంచి వెలికితీశారు. ఘటనా స్థలం వద్ద మృతుల కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ టవర్‌లో అగ్నిప్రమాదం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ, నార్సింగి రోడ్డులోని బీఆర్‌సీ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లోని బ్లాక్ జీకి విద్యుత్ సరఫరా చేసే కేబుళ్ల డెక్‌లో ఆదివారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన సిబ్బంది టవర్‌లో ఉన్న వారందరినీ అప్రమత్తం చేశారు. దాంతో వారంతా మెట్ల మార్గాల ద్వారా కిందకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే సరఫరాను నిలిపివేశారు. అగ్నిమాపక శాఖ వాహనాలు మంటలను ఆర్పివేశాయి. విద్యుత్ వైర్లు పూర్తిగా కాలిపోవటంతో టవర్‌లోని 19 అంతస్తులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మెట్ల మార్గంలో కిందకు పరుగులు తీస్తున్న క్రమంలో ముగ్గురు కింద పడిపోవటంతో గాయాలయ్యాయి.

హత్య పాపం వారిదే..

తండ్రి, కొడుకులను అరెస్టు చేసిన పోలీసులు

షాబాద్: హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించిన కేసును షాబాద్ పోలీసులు ఛేదించారు. సొంత తండ్రి, తమ్ముడే హత్య చేసినట్లు నిర్ధారించారు. షాబాద్ సీఐ కాంతారెడ్డి తెలిపిన ప్రకారం.. ఈనెల 8న మండల పరిధిలోని కుర్వగూడకి చెందిన దాదే బాలకృష్ణ(45) ఇంట్లో మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, దర్యాప్తు చేపట్టారు. విచారణలో తండ్రి, తమ్ముడు బాలకృష్ణని చున్నీతో ఉరి వేసి, చంపినట్లుగా నిర్ధారించారు. ఆపై ఆత్మహత్య చేసుకున్నట్లుగా నమ్మించారు. ఆదివారం నిందితులిద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం



నేనావత్ రమ్లి (ఫైల్)

ఆమనగల్లు: మున్సిపల్ పరిధిలోని నుచ్చుగుట్ట తండాకు చెందిన నేనావత్ రమ్లి అదృశ్యమైంది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం.. తండాకు చెందిన రమ్లి కుటుంబ సభ్యులతో గొడవ కారణంగా మనస్థాపానికి గురై ఇంటినుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు సాధ్యమైన ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె కుమారుడు భీమన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైకును ఢీకొన్న జీపు..ఇద్దరికి తీవ్రగాయాలు

హస్తినాపురం: ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు స్నేహితులను వెనుక నుండి వేగంగా వచ్చిన జీపు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రవి నాయక్ తెలిపిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్లకు చెందిన ఫయాజ్ (21) మంగళపల్లిలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాల నుండి బైకుపై అదే కళాశాలలో చదువుతున్న స్నేహితురాలు (21)తో కలిసి సాగర్ రింగ్‌రోడ్డు వైపు వస్తుండగా గుర్రంగూడ వద్ద యూటర్న్‌లో వెనుక నుంచి వేగంగా వచ్చిన థార్ కారు ఢీకొట్టింది. దీంతో ఫయాజ్ తలకు తీవ్రగాయాలు కాగా కుడి కాలు విరిగింది. వెనుక కూర్చున్న స్నేహితురాలి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు ఫోన్ చేయగా క్షతగాత్రులను అంబులెన్స్‌లో స్థానికంగా ఉన్న ఓ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఫయాజ్‌కు ప్రాథమిక చికిత్స అనంతరం మలక్‌పేటలోని యశోదా ఆసుపత్రికి తరలించగా, అతని స్నేహితురాలిని సికింద్రాబాద్ యశోదా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన జీపు డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం మరో ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవినాయక్ తెలిపారు.

ఆర్టీసీకి ఏఐ దన్ను



ప్రయాణికుల రద్దీ, డిమాండ్ మేరకు ట్రిప్పులు పెంచేందుకు ఆర్టీసీ ప్రణాళికలను రూపొందిస్తోంది. అధునాతన ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో వివిధ రూట్‌లలో ప్రయాణికుల సంఖ్య, రాకపోకలు, ప్రయాణ వేళలు తదితర అంశాలపై శాస్త్రీయమైన అధ్యయనం చేసి సమగ్ర నివేదికను సిద్ధం చేసేందుకు సాంకేతిక నిపుణుల సహాయం తీసుకోనుంది.

– సాక్షి, సిటీబ్యూరో

ఏ రూట్‌లో ఎంతమంది ప్రయాణికులు

- రద్దీ, డిమాండ్ మేరకు బస్సుల నిర్వహణ
- అధునాతన సాంకేతికత వినియోగం
- రూట్‌లపై శాస్త్రీయ అధ్యయనం
- ప్రయాణికుల సంఖ్య పెంపునకు ప్రణాళికలు

మహా నగర పరిధి అనూహ్యంగా విస్తరిస్తోంది. ప్రతి ఏటా కొత్త కాలనీలు ఏర్పడుతూనే ఉన్నాయి. దీంతో ప్రయాణికులు ఏ ప్రాంతం నుంచి ఎక్కువగా బయలుదేరుతున్నారు. ఏయే ప్రాంతాల మధ్య రాకపోకలు విరివిగా కొనసాగుతున్నాయనే అంశంపై స్పష్టత ఉండడం లేదు. జీడిమెట్ల, దుండిగల్ చుట్టుపక్కల ప్రాంతాల్లో విస్తరించిన వందల కొద్దీ కాలనీల నుంచి హైటెక్ సిటీ, మాదాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, మణికొండ, నార్సింగి, తదితర ప్రాంతాలకు ప్రయాణికుల రాకపోకలు భారీగా ఉన్నాయి. ప్రైవేట్ సంస్థల్లో పని చేసే వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది ఈ ప్రాంతాల నుంచి ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారు. కానీ.. ప్రయాణికుల డిమాండ్ మేరకు బస్సులు అందుబాటులో ఉండడం లేదు. పైగా ఏ కాలనీ నుంచి, ఏయే సమయాల్లో ఎక్కువ మంది రాకపోకలు సాగిస్తున్నారనే అంశాలపై కూడా తగిన సమాచారం ఉండదు. ఈ క్రమంలో సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా రియల్ టైమ్ డిమాండ్‌ను కచ్చితంగా అంచనా వేసి బస్సులను ఏర్పాటు చేయాలనేది ప్రతిపాదన.

ప్రతి రూటూ వాస్తవ చిత్రీకరణ..

- ఆర్టీసీ లెక్కల ప్రకారం గ్రేటర్ పరిధిలో సుమారు 1050 రూట్‌లు ఉన్నాయి. గత ఐదారేళ్లుగా విస్తరించిన నగర శివార్లను పరిగణనలోకి తీసుకొంటే ఈ రూట్‌ల సంఖ్య 1500 దాటి ఉంటుంది. కొన్ని రూట్‌లలో ప్రయాణికుల డిమాండ్, రద్దీ చాలా తక్కువగా ఉంటుంది. ఉదయం, సాయంతం వేళల్లో మాత్రమే ఎక్కువ మంది ప్రయాణం చేస్తారు. మిగతా వేళల్లో పెద్దగా డిమాండ్ ఉండదు. అలాంటి రూట్‌లపై సరైన వివరాలు లేకుండా బస్సులను నడపడంతో నష్టం వాటిల్లుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. ఇలా ప్రయాణికుల ఆదరణ లేని మార్గాల్లో ట్రిప్పులను తగ్గించి, డిమాండ్ ఎక్కువగా ఉన్న మార్గాల్లో పెంచేందుకు ప్రతి రూట్‌ను సమగంగా అధ్యయనం చేసి గణాంకాలను రూపొందించనున్నారు. ఇందుకోసం ఒక ప్రైవేట్ సంస్థకు చెందిన సాంకేతిక నిపుణుల సహాయంతో డిపోల వారీగా వివిధ రూట్‌ల వివరాలను సేకరించనున్నారు.
- గ్రేటర్‌లో ప్రస్తుతం 25 డిపోల్లో ప్రస్తుతం 3,150 బస్సులు ఉన్నాయి. వీటిలో 10 శాతం బస్సులను స్పేర్‌లోనే ఉంచుతారు. దీంతో సుమారు 2,950 బస్సులు ప్రతిరోజు ప్రయాణికులకు రవాణా సదుపాయాన్ని అందజేస్తున్నాయి.



ప్రస్తుతం రోజుకు 26 లక్షల మంది ప్రయాణిస్తున్నట్లు అంచనా. ప్రతి రోజు 31వేలకు పైగా ట్రిప్పులు తిరుగుతున్నాయి. ప్రతి ట్రిప్పు నుంచి ఆశించిన స్థాయిలో ఆదాయం లభించడం లేదు. ఆదాయం కంటే నిర్వహణ వ్యయం ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో అన్ని ట్రిప్పులను క్రమబద్ధీకరించాలని భావిస్తున్నారు.

ఆక్యుపెన్సీ ఉన్నా ఆదాయం అంతంతే...

మహాలక్ష్మి పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. సుమారు 18 లక్షల మంది మహిళలు సిటీ బస్సుల్లో పయనిస్తున్నారు. వీరి చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తోంది. ప్రతిరోజు ఆర్టీసీకి నగదు రూపంలో ఆదాయం లభించేది పురుషుల నుంచే. ప్రతి రోజు 8 లక్షల మంది మగవారు ప్రయాణం చేస్తున్నారు. రోజుకు రూ.6.5 కోట్ల ఆదాయం లభిస్తే అందులో రూ.4 కోట్ల వరకు రియంబర్స్‌మెంట్ రూపంలో ఆర్టీసీ ఖాతాలో జమ అవుతోంది. మిగతా 2.5 కోట్లు మాత్రమే నగదు రూపంలో అందుతోంది. ఈ ఆదాయం కంటే నిర్వహణ వ్యయం, ఉద్యోగుల జీతభత్యాలు తదితర ఖర్చులే అధికంగా ఉన్నాయి. దీంతో ప్రయాణికుల సంఖ్యను పెంచుకొనేందుకు, తద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకొనేందుకు కూడా ఈ సాంకేతిక పరిజ్ఞానం దోహదం చేస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కూతురిలా ఉన్నావంటూనే...

- అసభ్యకరంగా ప్రవర్తించిన పైఅధికారి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి.. కేసు నమోదు

బంజారాహిల్స్: కూతురిలా ఉన్నావని ప్రారంభంలో మర్యాదగా మాట్లాడి..చనువు పెంచుకుని మెల్లమెల్లగా తన దుర్బుద్ధిని బయటపెట్టిన సీనియర్ అధికారిపై ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. మైండ్‌స్పేస్‌లోని ఓ ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలో హెచ్‌ఆర్‌గా పనిచేస్తున్న యువతి (26)కి తన పైఅధికారిగా పనిచేస్తున్న మృణాల్‌దాస్ (51)తో పరిచయం ఏర్పడింది. తరుచూ ఇద్దరూ మాట్లాడుకుంటూ పరిచయం పెంచుకున్నారు. తన కుమార్తెలా ఉన్నావంటూ మృణాల్‌దాస్ మొదట్లో ఆత్మీయతంగా వ్యవహరించేవాడని బాధిత యువతి పేర్కొంది. ఈ ఏడాది జులై 5వ తేదీన ఆమె మృణాల్‌దాస్‌తో కలిసి జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–72లో ఉన్న ది స్విఫ్ట్ ఎలిమెంట్ స్పాకు వెళ్లినట్లు తెలిపింది. పురుషులు, మహిళలకు వేర్వేరు గదులు ఉన్నాయని చెప్పడంతో తాను వెళ్లగా తనకు మసాజ్ చేస్తున్న సమయంలో నిద్రలో ఉండగా ఒక దశలో వెనుక నుంచి వేరొకరి చేతులు తగిలాయని, గమనించి చూసేసరికి మృణాల్‌దాస్ తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని గుర్తించానంది. తనపై అనుచితంగా ప్రవర్తిస్తూ అసభ్యకరంగా మాట్లాడుతుండటంతో తాను అరిచి మందలించానని తెలిపింది. ఆయన గది నుంచి వెళ్లిపోయినప్పటికీ మళ్లీ రావాలని ప్రయత్నించాడని ఆరోపించింది. ఇటీవల ఆయన లండన్‌కు వెళ్లడం జరిగిందని, అక్కడి నుంచి కూడా వీడియో కాల్ ద్వారా అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆరోపించింది. ఈ సంఘటనను తాను పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ సంస్థ హెచ్‌ఆర్ టీమ్‌కు కూడా తెలియజేశానని పేర్కొంది. తన భద్రత పట్ల భయంగా ఉందని, ఆయన మళ్లీ వేధించే అవకాశం ఉందంటూ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. జూబ్లీహిల్స్ పోలీసులు మృణాల్‌దాస్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 75 (1) (ఐ) (2), 78 (1)(ఐఐ)(2), 79 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం చోరీ

రాజేంద్రనగర్: ఇంటి ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనాన్ని ఓ దొంగ నిమిషాల వ్యవధిలో దొంగలించి పారిపోయిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... బుద్వేల్ హనుమాన్ దేవాలయం ప్రాంతంలో మసూద్ తన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. ప్రైవేటు ఉద్యోగం నిర్వహించే మసూద్ ఈ నెల 8వ తేదీన రాత్రి విధులు నిర్వహించుకొని తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్కు చేసి లోనికి వెళ్లాడు. లోపలికి వెళ్లిన 15 నిమిషాల అనంతరం బయటికి వచ్చి చూడగా వాహనం కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల ప్రాంతాలు వెతికినా ప్రయోజనం లేకపోవడంతో రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించాడు. ఓ యువకుడు ద్విచక్ర వాహనాన్ని కేవలం నిమిషాల వ్యవధిలోనే తీసుకొని ఉడాయించాడు. ఈ దొంగతనానికి సంబంధించిన పూర్తి దృశ్యాలు అక్కడే ఉన్న సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఫ్లైట్‌లో ప్రయాణికుడికి అనారోగ్యం

టేకాఫ్ తీసుకున్న కొద్ది నిమిషాలకు తిరిగొచ్చిన విమానం

శంషాబాద్: విమానంలో ఓ ప్రయాణికుడు అస్వస్థతకు గురికావడంతో విమానం తిరిగి వచ్చి ఆలస్యంగా బయలుదేరిన సంఘటన ఆదివారం శంషాబాద్ విమానాశ్రయంలో చోటు చేసుకుంది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఇండిగో విమానం 6ఈ–6223 విమానంలో 166 మంది ప్రయాణికులతో సాయంత్రం 3.55 గంటలకు బిహార్ రాజధాని పాట్నాకు టేకాఫ్ తీసుకుని బయలుదేరింది. కొద్ది నిమిషాల అనంతరం 11ఈ సీటులో కూర్చున్న ప్రయాణికుడు సంతోష్‌కుమార్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో పాటు వాంతులు చేసుకోవడంతో వెంటనే పైలట్ అధికారుల అనుమతితో ఎయిర్‌పోర్టులో 4.15 గంటలకు తిరిగి ల్యాండ్ చేశారు. అస్వస్థతకు గురైన ప్రయాణికుడికి ఆస్పత్రికి తరలించారు. తిరిగి విమానం సాయంత్రం 5.56 గంటలకు 165 మంది ప్రయాణికులతో పాట్నా బయలుదేరింది.

లిఫ్ట్ గుంతలో పడి కార్మికుడు మృతి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రమాదవశాత్తు భవనం నాలుగో అంతస్తు నుంచి లిఫ్ట్ గుంతలో పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం ఉదయం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మహమూద్ షహబాజ్(19) కుటుంబ సభ్యులతో కలిసి బోరబండ ప్రాంతంలో ఉంటున్నాడు. వృత్తి రీత్యా ఫాల్‌సీలింగ్ పనులు చేసే షహబాజ్ కొన్ని రోజులుగా శాస్త్రీపురం ప్రాంతంలోని ఓ భవనంలో పనులు చేస్తున్నాడు. ప్రతి రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం పనికి వచ్చి నాలుగో అంతస్తులో ఫాల్‌సీలింగ్ వేసే పని చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు కింద ఉన్న లిఫ్ట్ గుంతలో పడి మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు పాడు చేశారంటూ కారు డ్రైవర్‌పై ఫిర్యాదు



వేస్తున్న రోడ్డుపైకి వచ్చిన కారు

మణికొండ: భారీ వర్షాలతో గుంతల మయంగా మారిన రోడ్డు పనులను ఓ వైపు చేస్తుండగానే ఓ కారు దానిపైకి వచ్చి మొత్తం పాడు చేసింది. దాంతో ఇంజనీరింగ్ అధికారులు కారు యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేసి కారును పోలీసులకు అప్పగించారు. మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని పాత ఆంధ్రాబ్యాంక్ చౌరస్తా నుంచి మర్రి చెట్టు వైపు ఉన్న రోడ్డు గుంతల మయంగా మారటంతో రెండు రోజులుగా కొత్త రోడ్డు పనులను చేపడుతున్నారు. ఆ విషయం గమనించకుండా ఆదివారం ఉదయం ఓ కారు వేస్తున్న రోడ్డుపైకి వచ్చి మొత్తం పాడు చేసింది. విషయం తెలుసుకుని మణికొండ మున్సిపల్ డీఈ శివసాయి సదరు కారు యజమానిపై రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేసి కారును వారికి అప్పగించినట్టు తెలిపారు. ప్రజలందరికీ అవసరమయ్యే పనులను చేపడుతున్నపుడు వారు సహకరించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. పది రోజుల పాటు సదరు రోడ్డును మూసి ఉంచుతున్నామని, ప్రయాణికులు ఇతర రోడ్ల ద్వారా వెళ్లాలని ఆయన కోరారు.

విదేశాలకు పంపుతానంటూ రూ.26 లక్షలు స్వాహా

వెంగళరావునగర్: విదేశాలకు పంపుతానని మోసగించి రూ.26 లక్షలు కాజేసిన వ్యక్తులపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం శ్రీనగర్‌కాలనీకి చెందిన శుభాంకర్ బ్యాంక్ ఆఫ్ అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. గత ఆగస్టు నెలలో శుభాంకర్ అమెరికా వెళ్లేందుకు ఏజెంట్లయిన మనీషా, ముస్తాఖ్ అనే వ్యక్తులను సంప్రదించాడు. ఎస్ఐజీ విద్యార్థులతో కలిపి అమెరికా పంపుతామని, అందుకు రూ.26 లక్షలు కావాలని అడిగారు. దాంతో అతను ఆ నగదును వారికి అందజేశాడు. అనంతరం తమ బ్యాంకు వేరే చోటుకు మారుతుందని, అక్కడ దరఖాస్తు ప్రాసెస్ చేస్తామని తెలిపారు. అయితే కొద్దిరోజులుగా శుభాంకర్ వారి కార్యాలయానికి వెళ్తున్నా వారి జాడ కన్పించలేదు. అంతేగాకుండా ఫోన్లకు సమాధానం ఇవ్వడం లేదు. దాంతో మోసపోయానని గ్రహించి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రక్తమోడుతున్న రహదారి..!

- బెంగళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో జాప్యం
- వాహనదారులకు శాపం



పెద్దషాపూర్ శివారులో అసంపూర్తిగా ఉన్న జాతీయ రహదారి విస్తరణ పనులు

శంషాబాద్ రూరల్: రహదారి విస్తరణ పనుల్లో జాప్యం నెలకొనడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తొండుపల్లి రైల్వే వంతెన సమీపం నుంచి పాల్మాకుల వరకు మండల పరిధిలో జరుగుతున్న పనుల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పనులను ప్రారంభించి దాదాపు మూడేళ్లు గడిచినా... ఓ అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కు అన్నట్లుగా మారింది. ఈ రహదారిపై రాత్రి సమయంలో ప్రయాణం వాహనదారులకు నరక ప్రాయమవుతోంది.

ఆరు వరుసలుగా...

శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని తొండుపల్లి నుంచి కొత్తూరు వరకు 12 కిలోమీటర్ల దూరం వరకు ఈ జాతీయ రహదారిని విస్తరిస్తున్నారు. ప్రస్తుతం నాలుగు వరుసలుగా ఉన్న రహదారిని ఆరు వరుసలకు విస్తరించడానికి సుమారు రూ. 540 కోట్లు కేటాయించారు. ఈ పనులను 2022 ఏప్రిల్‌లో కేంద్ర మంత్రి ఘడ్కరీ ప్రారంభించారు. ఆరంభంలో పనులు జోరుగా సాగినా.. మధ్యలో ఏడాది పాటు పనులు నిలిచిపోయాయి. అడపాదడపా అక్కడక్కడ పనులు చేస్తూ.. కాలం సాగదిస్తున్నారు.

ప్రమాదాలతో ప్రాణాలకు ముప్పు...

విస్తరణ పనులు పూర్తి కాకపోవడంతో రహదారిపై జరుగుతున్న ప్రమాదాలతో వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. రెండేళ్ల కాలంలో పదుల సంఖ్యలో వాహనదారుల ప్రాణాలు గాల్లో కలిసాయి. ఇక గాయాలై ఆస్పత్రి పాలైన వాహనదారులు చాలా మంది ఉన్నారు.

- రెండు నెలల కిందట మదన్‌పల్లి శివారులో రహదారిపై బైక్ మీద వెళ్తున్న ఇద్దరు యువకులు రోడ్డు పక్కన నిర్మాణ సామగ్రిని ఢీకొని అక్కడిక్కడే మృతి చెందారు.
- పాల్మాకుల శివారులో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి రహదారిపై జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు.



మదన్‌పల్లి శివారులో అసంపూర్తిగా రోడ్డు పనులు

పనులను వేగంగా పూర్తి చేయాలి



రహదారి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలి. ఈ రోడ్డుపై ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు చొరవ తీసుకుని పనులను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి.

– పి.శ్రీనివాస్‌రెడ్డి, పాల్మాకుల

- ఏదైనా ప్రమాదం జరిగినా.. వాహనాలు మరమ్మతులకు గురైనా రోడ్డుపై గంటల కొద్ది ట్రాఫిక్ నిలిచిపోతుంది. రాత్రి వేళల్లో జరిగే ఘటనలతో వాహనదారులు చాలా అవస్థలు పడుతున్నారు.